ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024





బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహనరెడ్డికి మిచౌంగ్ తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని ఫొటోల ద్వారా వివరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా(ఫైల్ ఫొటో)

జగనన్న హామీ.. హుళక్కే!

- అన్నదాతలకు ఇంకా అందని మిచౌంగ్ తుఫాన్ పరిహారం
- సంక్రాంతిలోపే ఇస్తామన్న సీఎం మాటలు నీటిమూటలే
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతుల ఎదురుచూపులు
- పంట నష్టం నివేదికల్లోనూ భారీగా కోత

బాపట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాన్ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల్ని అతలాకుతలం చేసి ఇప్పటికే నెలలు గడచిపోయింది. గతేడాది డిసెంబరు మొదటి వారంలో విరుచుకుపడిన తుఫాన్ ధాటికి అన్నదాతలు చిగురుటాకులా వణికిపోయారు. విపత్తు సృష్టించిన నష్టానికి ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా తోడవడంతో నష్టం తీవ్రత భారీగా పెరగడంతో అన్నదాత గుండె చెరువైంది. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించడానికి గతేడాది డిసెంబరు 8న సీఎం జగన్మోహనరెడ్డి జిల్లా పరిధిలోని కర్లపాలెం మండలం బుద్దాం, పాతనందాయపాలేనికి వచ్చారు. అక్కడ దెబ్బతిన్న వరిపైరును పరిశీలించడంతో పాటు రైతులనుద్దేశించి మాట్లాడారు. సంక్రాంతి పండగలోపే నష్టపోయిన అన్నదాతలందరికీ పరిహారం జమచేస్తామని గొప్పగా ప్రకటించారు. పండగ వచ్చి పోయింది.. కానీ రైతాంగం ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ అవ్వలేదు.

నివేదికలతో సరి...

మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలతో నివేదికను గతేడాది డిసెంబరు చివరికి వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఉద్యాన పంటలతో కలిపి జిల్లావ్యాప్తంగా మొత్తం 63,301 హెక్టార్లలో పంటకు మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టం వాటిల్లిందని, 92,220 మంది రైతులకు పరిహారం అందించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ జాబితా ప్రభుత్వానికి పంపించి కూడా రెండు వారాలు దాటింది. పైగా అన్నదాతలకు సంక్రాంతిలోపే డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని కూడా చెప్పారు.

నష్టం నివేదికల్లోనూ భారీగా కోత..

మిచౌంగ్ తుఫాన్ విరుచుకుపడినప్పుడు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికల ప్రకారం బాపట్ల జిల్లాలో 93,244 హెక్టార్లకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. ఇదే పల్నాడు జిల్లాకు వచ్చేసరికి ఇది 9,370 ఎకరాలుగా తేల్చారు. ఇక గుంటూరు జిల్లాకు 1,04,790 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అప్పట్లో ప్రాథమికంగా వ్యవసాయశాఖ నిర్ధారణకు వచ్చింది. నష్టం వివరాలను సోషల్ ఆడిట్ కోసం ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉంచినప్పుడు బాపట్ల జిల్లాలో సంఖ్య 78,173 హెక్టార్లకు తగ్గిపోగా చివరికి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో అది కాస్తా 63,301 హెక్టార్లకే పరిమితమైంది. ఇక పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా తుది జాబితాలో 50 శాతం విస్తీర్ణానికే చోటు దక్కింది.

ఉదారంగా ఆదుకుంటాం..

సీఎం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా ఆదుకుంటామనే మాటలు చెప్పారు. నష్టం నివేదికల్లో ఎక్కడా ఉదారత కనబడకపోగా అడ్డగోలుగా దెబ్బతిన్న విస్తీర్ణం తగ్గించడానికే ప్రయత్నించారు. ప్రాథమిక నివేదికలకు, తుది జాబితాకు పొంతన లేకపోవడమే దీనికి నిదర్శనం. పైగా సోషల్ ఆడిట్ పేరుతో తొలుత రూపొందించిన పంటనష్టం జాబితా వివరాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు. విచిత్రంగా తుది నివేదికలో సోషల్ ఆడిట్‌లో ఉంచిన జాబితా కూడా తగ్గిపోయింది.


ఇచ్చే కాస్తా ఎప్పుడిస్తారు..

దాదాపు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్ల నష్టాన్ని అన్నదాతలకు మిగిల్చిందని అప్పట్లో అంచనా వేశారు. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ నష్టం రూ.400 కోట్ల వరకు ఉంటుందని లెక్కకట్టారు. తీరా తుది జాబితాకు వచ్చేసరికి ఒక్క బాపట్ల జిల్లాలో రూ.101.40 కోట్ల నష్టమే జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించడంతో అవాక్కవడం రైతాంగం వంతైంది. ఇచ్చే ఆ కాస్తా సాయంపై కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేయడాన్ని అన్నదాతలు తప్పుబడుతున్నారు. సంక్రాంతికి పరిహారం అందిస్తామని జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలకే ఇప్పటివరకు మోక్షం కలగలేదని రైతులు వాపోతున్నారు.


పరిహారం అందించడంలో కూడా రాజకీయమా..

వాస్తవానికి సంక్రాంతికి పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా ఉండడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సమీప దూరంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఫిబ్రవరి చివరి వరకు కాలయాపన చేసి అప్పుడు అన్నదాతల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తే రాజకీయంగా తమకు ఉపయోగం ఉంటుందనే ఆలోచనలో పాలకపార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని బలపర్చే విధంగానే పరిహారం విషయంలో వ్యవసాయశాఖ సమాధానం ఉంటోంది. నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడంతో తమ పని అయిపోయిందని పరిహారం అందించే విషయంలో ప్రస్తుతానికి కదలికలేమి కనబడడం లేదని యంత్రాంగం సమాధానమివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తాజాగా విడుదలైన ఓటర్ల తుది జాబితాలో అక్రమాలు, అవకతవకలు యథాతథంగా కొనసాగుతూనే వున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లా? అధికారుల నిర్లక్ష్యమా? అధికార పార్టీ సేవలో తరిస్తున్న అధికారుల అనైతిక వైఖరా? కారణం ఏదన్నా.. తుది ఓటర్ల జాబితాలో కూడా తప్పుల తడకగానే విడుదల అయింది. ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన ఫిర్యాదుల్లో ఒకటి అరా ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వాటిని మాత్రమే సరిచేసిన అధికారులు మిగిలినవాటిని అలానే వదిలేశారు. గుంటూరు నగరంలో కొత్త, పాత డోర్ నెంబర్లతో విడుదలైన ఓట్ల జాబితాలో నెలకొన్న గందరగోళం తుది జాబితాలో కూడా యథాతథంగా కొనసాగింది. కొత్త డోర్ నెంబర్లతో జాబితాను రూపొందించి, అక్రమాలను అరికట్టాలన్న ప్రతిపక్ష పార్టీల వేడుకోళ్లను పక్కనపెట్టి పాత, కొత్త డోర్ నెంబర్లతోనే తుది జాబితాను విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు.



ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న డబుల్ ఎంట్రీలు



ఓటర్ల జాబితాలో ప్రత్యక్షమైన మృతుల ఓట్లు

ఆ ఓట్లకు.. మళ్లీ చోటు!

- ఓటర్ల తుది జాబితాలో తప్పులు యథాతథం
- మళ్లీ ప్రత్యక్షమైన డబుల్ ఎంట్రీలు
- ఆందోళన కలిగిస్తున్న మృతుల ఓట్లు
- పాత, కొత్త డోర్ నెంబర్లతో గందరగోళంగా జాబితా
- సరిచేయకుండా చేతులు దులుపుకున్న అధికారులు
- గుంటూరు ఓటర్ల తనిఖీలో వలంటీర్ల హడావుడి

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ నెంబరు పరిధిలో షేక్ గౌసియా బేగం పేరుతో, సయ్యద్ నబీ పేరుతో రెండేసి ఓట్లు వున్నాయి. ఇలా ఒకే పేరుతో వున్న రెండేసి ఓట్లపై గతంలోనే టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. కానీ అధికారులు మాత్రం వాటిని పట్టించుకోలేదు. దీంతో అవి తుది జాబితాలో తిరిగి ప్రత్యక్షమయ్యాయి. కోబాల్డ్‌పేటకు చెందిన దాసరి జయమ్మ కొన్నాళ్ల క్రితం చనిపోయింది. ఆమె ఓటు ముసాయిదా జాబితాలో వచ్చింది. దానిపై నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కానీ తుది జాబితాలో ఆ పేరు యథాతథంగా వచ్చింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్కో నియోజకవర్గంలో చనిపోయినవారి పేరుతో కొనసాగుతున్న ఓట్లు వేలల్లో వున్నాయి.

గుంటూరు 'పశ్చిమ' టార్గెట్..

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా వున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అధికారపార్టీ టార్గెట్ చేసింది. ఆ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఏడాది కాలంగా చేయని అక్రమాలు లేవు. ఒకే డోరు నెంబరుతో వందల ఓట్లను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అనుకూలుర ఓట్లు పెద్దసంఖ్యలో చేర్పించారని, ఒకరి పేరుతోనే రెండూ అంతకంటే ఎక్కువ ఓట్లు వున్నాయని, మృతుల ఓట్లు భారీసంఖ్యలో ఉన్నాయని ఫిర్యాదులు అందాయి. దీనికి తోడు పాత, కొత్త డోర్ నెంబర్లతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా వుందని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. కానీ అధికారులు ఒకటి రెండు ముఖ్యమైన ఫిర్యాదులను పరిష్కరించి వదిలేశారు. ఇప్పటికీ ఆ నియోజకవర్గం పరిధిలో డబుల్ ఓట్లు, మృతుల ఓట్లు లెక్కకు మించి వున్నాయి. ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో 10 నుంచి 15 వరకూ మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీలు వున్నట్లు వెలుగులోకి వస్తోంది. మొత్తంగా నియోజకవర్గం పరిధిలో 282 బూతుల్లో దాదాపు 5 వేల వరకూ మృతుల, డబుల్ ఎంట్రీ ఓట్లు వుంటాయని ప్రతిపక్ష పార్టీలు అంచనా వేస్తున్నాయి. వాటిపై కసరత్తు చేస్తున్నాయి.

మృతుల ఓట్ల తొలగింపు సవాలు...


గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మృతుల ఓట్ల తొలగింపు సవాలుగా మారింది. మృతుల ఓట్లను తొలగించాలని నియోజకవర్గ అధికారులకు ఫిర్యాదు చేసిన పలువురు నేతలు చివరకు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. అయినప్పటికీ ఇటీవల విడుదలైన తుది జాబితాలో మృతుల ఓట్లు దర్శనమిచ్చాయి. తాజా లెక్కల ప్రకారం 3 వేల వరకూ మృతుల ఓట్లు ఉన్నట్లు అంచనాకి వచ్చారు. మొత్తంగా జిల్లాలో 10వేలకు పైగా మృతుల ఓట్లు వున్నాయని, అవి యథాతథంగా తుదిజాబితాలో కూడా కనిపిస్తున్నాయని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఓట్లతో అధికారపార్టీ దొంగ ఓట్ల కుట్రలను కొనసాగిస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వలంటీర్ల హడావుడి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వలంటీర్ల హడావుడి కనిపిస్తోంది. ఓటర్ల జాబితా, ఎన్నికల అంశాల్లో వలంటీర్ల జోక్యం ఉండరాదని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆదేశించినా ప్రభుత్వం, అధికారపార్టీ వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వలంటీర్లను ఇంటింటికీ తిప్పి ఓటరు వెరిఫికేషన్, ఓటు నమోదు, తదితర పనులకు వారినే వినియోగిస్తున్న ఘటనలు అనేకం కనిపిస్తున్నాయి.

షెల్టర్ లెస్ చిరునామాతోనూ ఓటర్లు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెల్టర్ లెస్(నివాస రహిత) డోర్ నెంబరుతోనూ ఓటర్ల చేర్పులు జరిగాయి. ఇవి ఎస్ఎస్ఆర్ - 2024లో భాగంగా జరిగాయా... గత కొన్నేళ్ల క్రితమే నమోదయ్యాయా అన్న దానిపై స్పష్టత లేదు. బీఎల్‌వోలు కేవలం డోర్ టూ డోర్ పరిశీలన మాత్రమే జరిపి ఎవరికైనా ఓటుహక్కు లేకపోతే వారితో ఫారం-6 పెట్టించారు. అంతే తప్పా నివాసం లేకుండా ఉన్న వారి జోలికి అసలు పోలేదు. అయినప్పటికీ పలు పోలింగ్ బూత్‌లలో ఓటర్ల ఇంటి నెంబరు వద్ద షెల్టర్ లెస్ అని పొందుపరిచారు. వీటిపై ప్రతిపక్ష పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.



Name : UPPARAPALLI SRINIVASA REDDY
Fathers Name: UPPARAPALLI VENKATESWARA REDDY
House Number : SHELTER LESS
Age : 47 Gender : Male

Photo Available

షెల్టర్ లెస్ డోర్ నెంబరుతో ఓటరు

షెల్టర్‌లెస్ వారికి కూడా ఓటుహక్కు కల్పించే నిబంధన ఉన్నది. అయితే ఎక్కడైతే వారికి ఓటుహక్కు కల్పించారో ఆ పరిసరాల్లో సంబంధిత ఓటర్లు ఉంటున్నారా, లేదా అనేది బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉన్నది. నివాసరహిత ఓటర్లు పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. అలాంటప్పుడు స్థానికంగా ఉండకపోతే వారి ఓటుని ఫారం-7 పెట్టి తొలగించాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు ఈ దఫా ఎస్ఎస్ఆర్‌లో చేపట్టలేదు. ఇప్పుడు తుది ఓటర్ల జాబితాని విడుదల చేసిన తర్వాత కొంతమంది ఓటర్ల ఇంటి నెంబర్ల వద్ద షెల్టర్ లెస్ అని పేర్కొన్నారు. దీని వలన ఆయా ఓటరు ఎక్కడున్నారనే దానిని తెలుసుకోవడం కూడా కష్టమే.

కాగా 18 ఏళ్ల వయస్సు దాటి గతంలో ఓటు హక్కు పొందలేక గత ఎస్ఎస్ఆర్‌లో దరఖాస్తు చేసుకొన్న వారికి ఈఆర్‌వోలు ఓటుహక్కు కల్పించలేదు. అదేమంటే ఇప్పటివరకు ఎందుకు ఓటరుగా నమోదు కాలేదో తమకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని, దానినే తాము ఈసీకి పంపుతామన్నారు. అలా అండర్‌టేకింగ్ ఇచ్చిన వారికి కూడా ఓటుహక్కుని ఈఆర్‌వోలు జిల్లాలో పలుచోట్ల కల్పించలేదు.

ఓటు.. డిలీట్!

- ఎన్నో ఏళ్లుగా ఉన్న ఓటు తొలగింపు
- ఒకే కుటుంబంలో ఓట్లన్నీ తీసేసి...
- గ్రామంలో నివాసం ఉన్నా ఓటు లేనట్టేనట
- ముగ్గురున్న కుటుంబంలోకి మరో కొత్త ఓటు
- ఎవరిదోకూడా తెలియని విచిత్రం


తెనాలి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): బతికున్నవారి ఓట్లు మరణించినట్టు, చనిపోయినవారి ఓట్లు ఉన్నట్లు అనేక చిత్రాలకు చిట్టాగా మారిన మన ఓటర్ల జాబితాలో మరికొన్ని 'విచిత్రాలు' కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఓటున్న కుటుంబాలకు కుటుంబాల ఓట్లు ఏ కారణం లేకుండానే డిలీట్ కొట్టేయటం ఒక విచిత్రమైతే, అసలు ఎవరో తెలియని ఓట్లు కొన్ని కుటుంబాల జాబితాలో కలిపేయటం మరో గందరగోళానికి తెరతీస్తోంది.

తెనాలి నియోజకవర్గంలో పెదరావూరు గ్రామంలో నివాసముంటున్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతులు, వారి పిల్లల ఓట్లు కొత్త జాబితాలో కనిపిస్తున్నా, వాటిపై డిలీట్ అని కొట్టి ఉన్నాయి. ఇదే తరహాలో ఇదే గ్రామంలో మరికొన్ని కుటుంబాల ఓట్లుకూడా డిలీట్ చేయటం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకే ఓటు ఉండటం, వారుకూడా అదే గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా వారి ఓటు తొలగింపు కింద డిలీట్ చేయటంపై గందరగోళం నెలకొంది. తెనాలి నియోజకవర్గంలోని పెదరావూరు, సంగంజాగర్లమూడి, అంగలకుదురు, కొలకలూరు, నందివెలుగు, తెనాలి పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఓటర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఒక్కో గ్రామంలో కనీసం ఒకటి, రెండు కుటుంబాల ఓట్లు డిలీట్ జాబితాలోకి వెళ్లటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కొన్నయితే గత సవరణ జాబితా ఓటర్ల లిస్ట్‌లోకూడా సక్రమంగా ఉంటే, ఈసారి జాబితాలో డిలీట్ అని రావటం వంటి విచిత్రాలు కూడా ఉన్నాయని ఓటర్లు చెబుతున్నారు.

తెనాలి పట్టణంలోని 23వ వార్డులో నాగూర్ నివాసం ఉంటున్న ఇంటి నంబర్ కింద వారి కుటుంబంలోని ముగ్గురు ఓట్లే ఉంటున్నాయి. అయితే ఈసారి వారి ఇంటిలో నివాసం ఉంటున్నట్టు అదే ఇంటి నంబర్‌తో రమేష్ దాస్ అనే ఓటు కొత్తగా వచ్చి చేరింది. అయితే గత మూడు సవరణలకు ముందే నాగూర్ దానిని గుర్తించి బీఎల్ఓలకు, రెవెన్యూ అధికారులకు వివరించినా, పలుసార్లు రాతపూర్వకంగా అందించినా ఈసారీ ఆ పేరును తొలగించలేదు. ఒకవేళ దానిని తొలగించకపోతే, రేపటి పోలింగ్ రోజున అదే ఓటు దొంగ ఓటు కింద పడే ప్రమాదం ఉందనే అనుమానాన్ని అతను వ్యక్తం చేస్తున్నారు.



తెనాలి నియోజకవర్గం పెదరావూరులో ఒకే కుటుంబంలోని ఐదు ఓట్లు డిలీట్ చేసిన చిత్రం



గ్రామంలోనే నివాసం ఉన్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతుల ఓట్లు డిలీట్ చేసిన చిత్రం

టీడీపీలోకి.. రాయలు రాక

- నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి ఎంపీ లావు
- త్వరలో తెలుగుదేశంలో చేరనున్న శ్రీకృష్ణదేవరాయలు
- లావుతో పాటు పలువురు వైసీపీ నేతలు టీడీపీలోకి...



నరసరావుపేట, ఫిబ్రవరి 1: నరసరావుపేట పార్లమెంట్ నుంచి సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మరోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. అయితే ఈ సారి తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన పోటీ చేయనున్నారు. టీడీపీ అభ్యర్థిగా లావు పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇటీవలే ఆయన వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. 6వ తేదీ తర్వాత పార్టీలో చేరతారని ఆయన ముఖ్య అనుచరులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లావుతో పాటు వైసీపీలోని కొందరు ముఖ్య నేతలు టీడీపీలో చేరతారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, పలువురు ముఖ్య నేతలు చేరనున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా లావుతో కలసి టీడీపీలో చేరతారని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నారా లోకేశ్‌ను మక్కెన కలసినట్టు సమాచారం.

నరసరావుపేట పార్లమెంట్‌కు గత ఎన్నికల్లో లావు శ్రీకృష్ణ దేవరాయలు వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి రాయపాటి సాంబశివరావుపై 1,53,978 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలుపొందారు. అదే నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ టిక్కెట్‌ను లావు ఆశించారు. అయితే ఆ పార్టీ అధిష్ఠానం ఆయనకు టిక్కెట్ నిరాకరించింది. గుంటూరు పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని ప్రతిపాదించింది. నరసరావుపేట నుంచి పోటీ చేస్తానని గుంటూరుకు వెళ్లనని లావు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ పార్టీని వీడారు. ఇదిలా ఉంటే నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్న టీడీపీ అభ్యర్థులతో లావు టచ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. మరో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ అధికారికంగా అధిష్ఠానం వారి పేర్లు ప్రకటించలేదు.

నరసరావుపేట నియోజకవర్గంలో కొన్ని కీలక కేంద్ర పథకాలను మంజూరుచేయించడంతో లావు శ్రీకృష్ణదేవరాయలు విశేష కృషి చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు సంబంధించి వన్యప్రాణి సంరక్షణ, అటవీశాఖల అనుమతులు రావడం వెనుక ఆయన కృషి ఉంది. రైతుల ప్రయోజనాల కోసం ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు సాధించారు. నకరికల్లు మండలం నర్సింగపాడు వద్ద ఇటీవల శంకుస్థాపన చేశారు. జిల్లాలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆయన కృషి చేశారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయించారు. నియోజకవర్గ అభివృద్ధిపై లావు ప్రత్యేక దృష్టిసారించారు.

జిల్లాలో భారీగా.. డీఎస్పీల బదిలీ

- అత్యధిక మందికి స్థానచలనం
- దాదాపు అందరూ కొత్త ముఖాలే



గుంటూరు, ఫిబ్రవరి 1: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కొద్దిరోజులుగా జరుగుతున్న పోలీస్ అధికారుల బదిలీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఎస్పీలు, అదనపు ఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా డీఎస్పీలను బదిలీ చేసింది. జిల్లాలో అత్యధిక మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలతో పాటు స్థానిక వైసీపీ అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల సిఫార్సుల ఆధారంగా పెద్దఎత్తున పోలీసుల బదిలీలు జరిగాయి.

బదిలీ అయిన డీఎస్పీల వివరాలు...

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో విధులు నిర్వహిస్తున్న జీసీ గురునాథ్ బాబును సత్తెనపల్లి డీఎస్పీగా, డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సి.విజయభాస్కరరావును నెల్లూరు, డీఎస్ఆర్‌పీకు బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసరావుపేటకు, కమిషనరేట్‌లోని నార్త్ డివిజన్లో పనిచేస్తున్న సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా, కమిషనరేట్‌లో దిశ డీఎస్పీగా పని చేస్తున్న వీవీ నాయుడును గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు. కమిషనరేట్‌లో సీటీఎఫ్ డీఎస్పీగా పనిచేస్తున్న బీవీ సుబ్బారావును దిశ డీఎస్పీగా, మైలవరంలో పనిచేస్తున్న ఎం.రమేష్‌ను గుంటూరు సీసీఎస్‌కు, గుంటూరు నార్త్ డీఎస్పీగా పనిచేస్తున్న జవంగుల రాంబాబును మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ చేశారు. తుళ్లూరు డీఎస్పీ వి.పోతురాజును గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌కు నియమించారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డిని శ్రీకాళహస్తికి, సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను తూర్పుగోదావరి, దిశ డిఎస్పీగా నియమించారు. అలాగే గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ మందుల బాలసుందరరావును మార్కాపురం, గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాష్ బాబును ఎన్టీఆర్ కమిషనరేట్ దిశా డీఎస్పీగా నియమించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పి తుపాకుల వెంకటరత్నస్వామిని ప్రకాశం జిల్లా దిశా డీఎస్పీగా, నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్‌ను వెస్ట్ డీఎస్పీగా, ప్రకాశం దిశా డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల క్రైమ్ డీఎస్పీగా, బాపట్ల దిశా డీఎస్పీ కె.నాగేశ్వరరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఇంటిలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును తుళ్లూరు డీఎస్పీగా నియమించారు.

7లో..

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

అనుమతులు చూపించే వరకు తవ్వకాలు నిలిపి వేయాలన్న గ్రామస్తులు

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

చిరంజీవి నో.. వెంకటేశ్ ఎస్ ?





ఇండస్ట్రీలో ఒక హీరో నో చెప్పిన చిత్రాలకు మరో హీరో ఎస్ చెప్పడం పరిపాటే. తాజాగా టాలీవుడ్‌లోనూ అలాంటి సంఘటనే చోటు చేసుకుందని ఇండస్ట్రీ టాక్. దిల్ రాజు నిర్మాతగా దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవి కోసం ఓ కథను సిద్ధం చేశారనే మాట కొన్నాళ్లుగా పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రాజెక్ట్ కూడా దాదాపు ఓకే అయినట్లేనని భావించారు. కానీ ఆ కథ చిరంజీవిని మెప్పించలేకపోయిందనే మాట ప్రస్తుతం వినిపిస్తోంది. దాంతో వెంకటేశ్ దగ్గరకు వెళ్లిన అనిల్ రావిపూడి అదే కథను ఓకే చేయించుకున్నారనీ, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే ఇంతకీ ఆ కథలో చిరంజీవికి ఏం నచ్చలేదు, వెంకటేశ్‌కు ఏం నచ్చి ఓకే చేశారు అనేది ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ముందుకు వచ్చేవరకూ మిస్టరీగానే మిగిలిపోతుంది.

కొత్త ప్రపంచంలోకి వెళతారు



గీతానంద్

'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా కొత్తగా చూపించాలని ప్రయత్నించాం. లూజర్ నుంచి విన్నర్‌గా హీరో ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు గీతానంద్. ఆయన హీరోగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ' మా తమ్ముడు దయానంద్ డైరెక్టర్ కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా చర్చించుకున్నాం. ఇద్దరం కలసి ఇంతకుముందు షార్ట్ ఫిల్మ్స్ చేశాం. ఈ సినిమా విషయంలో ఆ అనుభవం మాకు హెల్ప్ అయింది. నిర్మాత రవి కస్తూరి కూడా నాకు ఫ్రెండ్ కావడంతో ముగ్గురం కలసి చర్చించుకుని నిర్ణయాలు తీసుకొనేవాళ్లం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త గేమ్ వరల్డ్‌లోకి వెళ్లిపోతారు' అని చెప్పారు. సీక్వెల్ కోసం వేరే ప్లానింగ్ ఉందనీ, ఈ సినిమాకు వచ్చే రియాక్షన్ బట్టి దాన్ని ప్రకటిస్తామని తెలిపారు.



సుహాస్ హీరోగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ ఈ చిత్రం బిగ్‌టికెట్‌ను రిలీజ్ చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పన్నెండు గుంజల పందిరి కింద



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'పన్నెండు గుంజల పందిరి కింద' అంటూ సాగే గీతాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే తెలంగాణ మట్టి వాసన కనిపిస్తోంది. పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్యం, సురేశ్ బొబ్బిలి సంగీతం ఆకట్టుకున్నాయి. ఇకపై ప్రతిపెళ్లిలో ఈ పాట వినిపిస్తుంది' అన్నారు. మా సినిమాకు ఈ పాట ప్రత్యేకాకర్షణ అవుతుందని దర్శకుడు తెలిపారు.

ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో...

'బిగ్‌బాస్' అమర్‌దీప్ హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నటించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత ఎ.ఎం.రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ ఇచ్చారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లకముందే ఈ సినిమాకు సైన్ చేసినట్లు హీరో అమర్‌దీప్ చెప్పారు. నటి సురేఖా వాణి మాట్లాడుతూ 'ఈ ప్రాజెక్ట్ విన్న తర్వాత వీళ్లు చేస్తారా లేదా అనే అనుమానం వచ్చింది. దర్శకనిర్మాతల మీద నమ్మకంతోనే నా బిడ్డను వాళ్ల చేతులో పెట్టా' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: బాల సరస్వతి.



విశ్వంభర కోసం సన్నద్ధం



చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండడంతో చిత్రీకరణలో పాల్గొనేందుకు చిరంజీవి సన్నద్ధమవుతున్నారు. సరికొత్త లుక్‌లో కనిపించేందుకు జిమ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియోను గురువారం ఆయన సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. 'విశ్వంభర' కోసం సిద్ధమవుతున్నానని ఆ వీడియోలో చిరంజీవి తెలిపారు. యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఛోటా కే నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.













అభివృద్ధిని మరిచి.. దోపిడీ మరిగారు

మూడు ముక్కల ఆటతో రాష్ట్రం అధోగతి

1507వ రోజు ఆందోళనల్లో అమరావతి రైతులు



మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్లూరు ఫిబ్రవరి 1: వైసీపీ పాలకులు వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధిని పూర్తిగా మరిచి, దోచుకోవడం మరిగారని రాజధాని రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తోన్న ఆందోళనలు, నిరసనన దీక్షలు గురువారానికి 1507వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి అధోగతిపాలు చేశారన్నారు. అభివృద్ధి ఎక్కడా లేదని, అంతా అవినీతిమయం అయిపోయిందన్నారు. ఏ వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదన్నారు. బటన్ నొక్కి డబ్బులేసి జనాన్ని జగన్‌రెడ్డి మభ్యపెడుతున్నారన్నారు. సీఎం జగన్ పన్నుల బాదుడుతో రూపాయి ఇచ్చి పది రూపాయలు కాజేస్తున్నాడని జనం తెలుసుకున్నారన్నారు. అమరావతిని నిర్వీర్యం చేసి రైతులను అష్టకష్టాలు పెడుతున్నారన్నారు. తమను నడి రోడ్డు మీదకు లాగిన జగన్‌రెడ్డి అంతకంత అనుభవించక తప్పదన్నారు. రాజధాని గ్రామాల్లో అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

గిరిజన సంక్షేమంపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి డైరెక్టర్ స్పందన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణకు ఆదేశించారు. 'వంటోళ్లే వార్డెన్లు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ స్పందించారు. ఉద్యోగ నియామకాలు, బదిలీలపై విచారణ చేపట్టాలని విద్యా శాఖ డైరెక్టర్‌ని ఆదేశించారు. ఏసీబీ తనిఖీల తర్వాత కూడా వార్డెన్‌పై చర్యలు తీసుకోకపోవడంపై కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఆర్‌వోఆర్ ఫైల్ మాయం?

గుంటూరు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అక్రమాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా ఆ శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా ఉద్యోగుల ఆర్‌వోఆర్ ఫైల్(రూల్ ఆఫ్ రిజర్వేషన్) మాయమైనట్లు సమాచారం. ఉద్యోగోన్నతుల్లో అత్యంత కీలకపాత్ర పోషించే ఈ ఫైల్ మాయం కావడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తగిన అర్హత లేకపోయినా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా పనిచేసిన ఉద్యోగి హయాంలోనే ఆర్‌వోఆర్ ఫైల్ మాయమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యార్థులకు అన్యాయం

కొందరు అధికారుల అవినీతి వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంక్షేమ సంఘ నేత చంద్రానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కొందరికి కోట్ల రూపాయలు సంపాదించి పెట్టే కల్ప తరువుగా మారిందని ఆరోపించారు. పిల్లలు లేకుండానే ఉన్నట్లు చూపించి నిధులు డ్రా చేసిన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అర్హత లేని వ్యక్తులు ఉన్నత స్థాయిలో ఉంటే నిజమైన గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

హైదరాబాద్‌పై జార్ఖండ్ ఘనవిజయం



ప్రియాంక లూథ్రా, పల్వికా రాథోడ్, జాస్మిన్ గిల్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1: బీసీసీఐ మహిళల అండర్-23 వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ మైదానంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై జార్ఖండ్ ఘనవిజయం సాధించింది. జార్ఖండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 45.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి కేవలం 139 పరుగులు మాత్రమే చేయ గలిగింది. హైదరాబాద్ జట్టులో టీ.చందన 30 పరుగులు, ఎం.సాక్షీరావు 28 పరుగులు సాధించగా, జార్ఖండ్ బౌలర్ పల్వికారాథోడ్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు 41.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 142 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జార్ఖండ్ బ్యాటర్లు ప్రియాంక లూథ్రా 69 పరుగులు, శిఖా 40 పరుగులు చేయగా, హైదరాబాద్ బౌలర్ జాస్మిన్ గిల్ 3 వికెట్లు తీసింది. మంగళగిరి ఏసీఏ మైదానంలో తదుపరి మ్యాచ్ జార్ఖండ్, ఉత్తరాఖండ్ జట్ల మధ్య ఈ నెల 3న జరగనుంది.

ఆంధ్రజ్యోతి

ఉద్యోగావకాశాలు

➾ Wanted Sales executives for NEXA Car Showroom in Guntur / Rural Areas. Experience / Fresher in Sales can Apply. Cont: 9100787054

AAA-8668

EDUCATION

➾ ఇంటర్ / డిగ్రీ పాసైన వారు B.Sc, B.Com, BA, B.Ed, M.Sc,M.Com MA పొందుటకై చివరి అవకాశం, శ్రీ సత్య సూర్య కాలేజి, 4/18, బ్రాడీపేట, గుంటూరు. 9346446079

AJG-184478

ఆయుర్వేదం

➾ అంగస్తంభన లేకపోవడం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికాఔషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా. సిహెచ్. రామకృష్ణ, VJA సెల్: 84650 56299

AJB-917

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రజల్ని చైతన్య పరిచే అద్భుత కళ.. యక్షగానం

చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య

అట్టహాసంగా ప్రారంభమైన విజ్ఞాన్ మహోత్సవం



గడ్డం సమ్మయ్యను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1: ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు యక్షగానం కళ ఎంతో దోహదపడిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తెలిపారు. చిన్న వయస్సు నుంచే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన మద్యపాన నిషేధం, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, హెచ్‌ఐవీ వంటి కార్యక్రమాలపై వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చానని తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో గురువారం విజ్ఞాన్ మహోత్సవ్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళైన చిందు యక్షగానానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత చదువుకే పరిమితం కాకుండా యోగ, సంగీతం, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన డంతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని దానిని వెలికితీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. యువత తమ సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. యువత కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విజ్ఞాన్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ వర్సిటీ గడిచిన 20 ఏళ్ల నుంచి నిరంతరాయంగా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్విరామంగా చేస్తున్నామని తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో 75 ఈవెంట్లను ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా సాంస్కృతిక ప్రద ర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం, యోగాతోనే సాధ్యమని చూపించిన నృత్య ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

అనుమతులు చూపించే వరకు తవ్వకాలు నిలిపివేయాలన్న గ్రామస్తులు

కొల్లూరు, ఫిబ్రవరి 1: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఊరు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని తవ్వకాలను మండల పరిధిలోని పెదలంక గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. అనుమతులు చూపించాలని పెద్దసంఖ్యలో గ్రామస్తులు వెళ్లి జీసీకేసీ నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. ఇష్టానుసారంగా ఎక్కడిబడితే అక్కడ పెద్దపెద్ద గోతులు పెట్టి తవ్వకాలు చేస్తే వరద నీరు గ్రామాల్ని ముంచి వేస్తుందని మండిపడ్డారు. గతంలో వరదల వల్ల విరిగిపోయిన పొలాల్లో ఇసుక మేటలను అనుమతులు లేకుండా ఎలా తవ్వుతున్నారని ప్రశ్నించారు. అనుమతులు చూపించాలని, అప్పటి వరకు తవ్వకాలు చేస్తే సహించేది లేదన్నారు. అనుమతులు ఉన్నాయని వాట్సాప్‌లో పంపిస్తామని చెప్పినా పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో యంత్రాలతో నిర్వాహకులు వెళ్లిపోయారు.



ఇసుక తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్తులు

చంపినా సరే వైసీపీలో కొనసాగం

ఎమ్మెల్యే నుంచి బెదిరింపు కాల్స్

గురజాల వైసీపీ కౌన్సిలర్ అనిత

గురజాలటౌన్, ఫిబ్రవరి 1: చంపినా సరే తాము వైసీపీలో కొనసాగేది లేదని, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి తలవంచేది లేదని 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మహంకాళి అనితనీలంరాజు తేల్చి చెప్పారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని తాము ఎన్నో కష్టాలు పడ్డామని, ఇందుకు సరైన గుణపాఠం చెప్పార ని ఆవేదన వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా తాను, తన భర్త రాజీనామా ప్రకటించామన్నారు. దీంతో తన భర్తకు కొద్ది రోజులుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. మాలధారణలో ఉన్న తన భర్త బుధవారం వీరభద్రస్వామి ఆలయానికి సద్ది కోసం వెళ్తుండగా మాచవరం ఎస్‌ఐ సమీర్‌బాషా కానిస్టేబుళ్లు వచ్చి బలవంతంగా తీసుకెళ్లారన్నారు. కౌన్సిలర్ భర్త నీలంరాజు మాట్లాడుతూ పోలీసులు చిత్రహింసలు పెట్టి కొట్టారన్నారు. తమకు ప్రాణహాని ఉందని దంపతులు తెలిపారు. ఎన్నికల్లో సీటు ఇచ్చి రూ.9 లక్షలు డబ్బులు ఇచ్చామని, తమాషా ఆడుతున్నావా అంటూ నీలంరాజుపై ఎమ్మెల్యే కాసు మండిపడిన ఆడియో కాల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయనున్నట్లు అనిత నీలంరాజు ప్రకటించారు. భార్యాభర్తలు గతంలో వైసీపీకి రాజీనామా చేయగా తాజాగా కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తాము ఊర్లో లేనందున ఈనెల 5న మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తామని తెలిపారు.



మహంకాళి అనితనీలంరాజు

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు మోటారు సైకిళ్లపై గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో వారిని మీడియా ఎదుట హాజరుపరిచి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి వివరాలు తెలిపారు. అరెస్టు అయిన వారిలో హైదరాబాద్‌లోని పురాణాపూల్‌కు చెందిన చింతల కుట్టి శివకుమార్(19) ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ గులబీగూడ గ్రామానికి చెందిన కిముడు శంకర్(19) ఉన్నారన్నారు. వీరు విశాఖపట్నం జిల్లా సీలేరు వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ మరో ముగ్గురు యువకులు కలిసి మోటారు సైకిళ్లపై విశాఖపట్నం జిల్లా సీలేరుకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి అదే మోటారు సైకిళ్లపై హైదరాబాద్ బయల్దేరారు. ఈ సమాచారం తెలిసి వారిలో ఇద్దరిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. వారి నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ.10 లక్షలు అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బస్తీలు, కళాశాలల్లో విక్రయించి డబ్బు సంపాదించాలని గంజాయిని రవాణా చేస్తున్నట్లు తమ విచారణలో వారు తెలిపారన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు జీ రవికృష్ణ, ఈ బాలకృష్ణ, జే శామ్యూల్ రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాదంలో ఉన్న భూమి మంత్రి అంబటి కొనుగోలు



విలేకరులతో మాట్లాడుతున్న కొత్తపల్లి విజయ ప్రసాద్, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: కోర్టు వివాదంలో ఉన్న తమ భూమిని మంత్రి అంబటి రాంబాబు కొనుగోలు చేశారని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ఎంవీపాలేనికి చెందిన కొత్తపల్లి విజయప్రసాద్ తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలో సర్వే నెంబరు 298/2ఏలో తమ నాయనమ్మ సరోజనమ్మకు రెండు ఎకరాలకు పైగా భూమి ఉండగా 2013లో కొందరు తప్పుడు సర్వే నెంబరుతో ఆ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. దీనిపై 2014లో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా ఆ భూమిని మంత్రి అంబటి రాంబాబు 18 జూలై 2022న తాడికొండ మండలం పొన్నెకల్లుకి చెందిన బొడ్డపాటి శివకృష్ణతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సమాచారం తెలుసుకున్న తాము కోర్టు ద్వారా మంత్రికి నోటీసులు కూడా జారీ చేశామన్నారు. అంబటి బినామీగా ధూళిపాళ్లకు చెందిన రావిపాటి పురుషోత్తం పవర్ ఆఫ్ అటర్నీ రాయించుకున్నారన్నారు. అంబటితో తనకు ప్రాణ భయం ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి మాట్లాడుతూ అంబటి అవినీతిపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తామని తెలిపారు.



భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మంత్రి అంబటి రాంబాబు, రాయపాటి పురుషోత్తమరావు కాపీ

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

తాడికొండ, ఫిబ్రవరి 1: ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడటంతో డ్రైవర్ వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన పల్లపాటి కోటేశ్వరరావు(50) మృతి చెందాడు. తాడికొండ-కంతేరు రోడ్డులో గురువారం ఈ ఘటన జరిగింది. తాడికొండ మండలం కంతేరు నుంచి తాడికొండ అడ్డరోడ్డుకు ముగ్గుర్ని ఆటోలో ఎక్కించుకుని కోటేశ్వరరావు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

ప్రీ ఆడిట్ కు 10 శాతం : ఖజానా కార్యాలయంలో వసూళ్లు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. తోటి ప్రభుత్వ ఉద్యోగులన్న కనికరం లేకుండా ప్రీ ఆడిట్‌లో ముక్కు పిండి వసూలు చేయడం వివాదాస్పదమౌతోంది. బిల్లు పాస్‌కు అంతోఇంతో ఇవ్వాలని కాకుండా, కచ్చితంగా 10 శాతం ఇవ్వాల్సిందే అంటూ పట్టుపట్టడంపై బాధిత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉద్యోగికి రూ.13 లక్షలు బకాయిలు రావాల్సి ఉండగా ప్రీ ఆడిట్ చేసిన అధికారులు రూ.1.30 లక్షలు ఆశించినట్లు ఆరోపణలున్నాయి. అందుకు సదరు ఉద్యోగి ఒప్పుకోకపోవడంతో దానిని మధ్యలో నే నిలిపివేశారని తెలిసింది. కొందరు రోజువారీ జీతంతో పనిచేస్తున్న ఉద్యోగులు తమ పర్మినెంట్ కోసం కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకుకోగా ప్రభుత్వం జీవో 610 విడుదల చేసింది. ఈ జీవో కింద నియమితులైన ఉద్యోగుల వద్ద ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి.

ఉపేక్షించేది లేదు..

అవినీతికి పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని జిల్లా ఖజానా అధికారి రాజగోపాలరావు అన్నారు. అధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

1,20,528 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,034 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,20,528 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 79,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	13000	19000
273	8500	17500
341	9000	21200
4884	11000	16500
సూపర్ 10	15000	17500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9500	20500
దేవనూరు డీలక్స్	9500	20000
తెల్లకాయలు	5000	12500

డీఎస్సీ పేరిట జగన్ మరో మోసం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 1: డీఎస్సీకి మంత్రి వర్గ ఆమోదం అంటూ మరోసారి నిరుద్యోగులను తనదైన శైలిలో మోసం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో హామీ ఇచ్చిన మెగా డీఎస్సీ ఏమైందో ఇప్పటికైనా సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ జగన్ సర్కారు నిరుద్యోగ యువతను మోసం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాగానే యువతకు 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని చెప్పారన్నారు, ఆ మాటలు నమ్మి డీఎస్సీ కోసమే ఏడు లక్షల మంది నిరుద్యోగులు నిద్రాహారాలు మాని, అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటూ కష్టపడుతున్నారన్నారు. ఐదేళ్లుగా వారి జీవితాలతో చెలగాట మాడింది కాకుండా ఇప్పుడు ఆరు వేల పోస్టులతో నోటిఫికేషన్ అనడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులోనూ రెండేళ్లు గౌరవ వేతనంతో అప్రెంటీస్ విధానం తిరిగి తీసుకురావడం దారుణం, నయవంచన అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్ చెప్పిన 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఐదేళ్ల తర్వాత కూడా ఆరు వేలకు ఎలా తగ్గాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌రెడ్డి కుర్చీ పీకడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో జగన్ దగా : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: మెగా డీఎస్సీ పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసమే డీఎస్సీ ఇచ్చినట్లు అర్థమవుతుందన్నారు. గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక ఐదేళ్లు ఆ మాట మరచి పోయాడన్నారు. దిగి పోయే ముందు ఆరు వేల పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించటం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. 2019 నుంచి ఒక్క డీఎస్సీని కూడా విడుదల చేయలేదన్నారు. జీవో 117తో ఉన్న ఖాళీలను కుదించి వేశారన్నారు. తక్కువ పోస్టులతో ప్రకటన జారీ చేయడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు నిరాశ మిగిలిందని తెలిపారు. నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్నారు

వైసీపీ నేతలపై మాజీ ఎమ్మెల్యే యరపతినేని ధ్వజం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1: గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు ఆక్రమించుకుని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందరు రెవెన్యూ అధికారుల అండతో అమ్మేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అయినా రెవెన్యూ శాఖ మౌనం దాల్చడంపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సర్వే నెంబర్లు, రెవెన్యూ రికార్డుల మార్పులు చేసి భూములను కాజేసిన వైసీపీ నేతలు వాటిని బ్యాంక్‌ల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారన్నారు. అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. చెరువు, వాగు పోరంబోకు భూములపై నిషేధం ఉన్నా ఆక్రమించుకుని రిజిస్టర్ చేయించుకుంటున్నారన్నారు. పిడుగురాళ్ల చెరువు భూములను విక్రయిస్తున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, పిడుగురాళ్ల వీఆర్వో సత్యారెడ్డి, స్టాంపు రైటర్ లింగారెడ్డి బైపాస్ రోడ్డు సమీపంలోని సర్వే నెంబరు 579, మరికొన్ని నెంబర్లతో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు, సబ్ రిజిస్ట్రార్‌లు విచారణ జరిపి రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ప్రభుత్వ భూమిగా ప్రకటించాలన్నారు. వైసీపీ భూ మాఫియాపై ప్రజాప్రభుత్వంలో విచారణ జరిపి, వారికి సహకరించిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులపై దాడి చేయించిన ఎమ్మెల్యే బొల్లా : జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 1: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో రైతులపై దాడులు చేయించి వారి పైర్లను కోయించి రౌడీయిజం చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో జీవీ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం వెల్లటూరులో బేతపూడి అమరలింగయ్య అనే రైతు మిర్చి సాగు చేయగా ఆ భూమిని తన మనమరాలికి ఇచ్చేందుకు ఎమ్మెల్యే బొల్లా సిద్ధమయ్యారన్నారు. అమరలింగయ్య భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఆయన కలెక్టర్, జేసీ, డీఆర్వో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో గవర్నర్‌ను బాధిత కుటుంబం కలసి ఫిర్యాదు చేసిందన్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు స్పందించి ఆ భూమి అమరలింగయ్యదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారన్నారు. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డం పెట్టుకుని వినుకొండలోని తన అనుచరులతో సాగులో ఉన్న మిర్చి పంటను, నీళ్ల పైపులను కోయించి పొలంలోని రెండు బోర్లను పూడ్చివేయించారన్నారు. తమపై దౌర్జన్యంచేసి, దాడి చేశారని బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో అమరలింగయ్య కుటుంబం ఫిర్యాదు చేసి ఆరు రోజులైనా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అమరలింగయ్య మిర్చిపంటను, బోర్లను ధ్వంసం చేసిన దుండగలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

బీసీలను అవమానించిన వైసీపీ ప్రభుత్వం

పల్నాడు జిల్లా బీసీలను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా అవమానించిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లాలో బీసీలు లేనట్లుగా నెల్లూరు నుంచి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను ప్రకటించడంపై ప్రజలు వైసీపీని ఛీ కొడుతున్నారన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా అక్రమ సంపాదనకు పాల్పడ్డారని, నెల్లూరులో బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అక్కడ చెత్త ఇక్కడ బంగారమెలా అవుతుందో చెప్పాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూసి పదవులు, రిజర్వేషన్లలో కోత విధించడం వల్ల 12 వేల మంది బీసీలు పదవులను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు బీసీల అభ్యున్నతికి సబ్‌ప్లాన్ ద్వారా రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం వాటిని తొలగించి బీసీలను మోసం చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ సాధికార సమితి అధ్యక్షుడు మానుకొండ శివప్రసాదరావు, నాగేశ్వరరావు, గోవిందనాయక్, ఆయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



గుంటూరు : భాస్కర్ సినిమాస్ QUBE 2K
గుంటూరు : The Cinemas QUBE 2K
గుంటూరు : V- ప్లాటినో QUBE 4K
గుంటూరు : JLE CINEMAS UFO 2K
గుంటూరు : సినీప్రైమ్ QUBE 2K
గుంటూరు : శివా QUBE 2K
గుంటూరు : సినీస్క్వేర్ QUBE 2K
గుంటూరు : KKR సాయినివ్య QUBE 4K
గుంటూరు : గౌరిశంకర్ QUBE 4K
ఒంగోలు : కృష్ణ QUBE 2K
ఒంగోలు : రవి ప్రియ QUBE 2K
తెనాలి : లక్ష్మి QUBE 2K
నరసరావుపేట: రవి కళామందిర్ QUBE 2K
నరసరావుపేట: విజేత QUBE 2K
చిలకలూరిపేట: KR కాంప్లెక్స్ QUBE 2K
మంగళగిరి : అన్నపూర్ణ QUBE 2K
సత్తెనపల్లి : శ్రీనివాస QUBE 2K
వినుకొండ : కీర్తి QUBE 2K
మాచర్ల : శ్రీనివాసమహల్ QUBE
అద్దంకి : కళామందిర్ QUBE 2K
రేపల్లె : బసవేశ్వర QUBE 2K
పిడుగురాళ్ళ : గంగామమల్ QUBE 2K
చీరాల : మోహన్ QUBE 2K
బాపట్ల : శ్రీనివాస QUBE 2K
పొన్నూరు : వింటేజ్ సినిమాస్-1 QUBE 2K
చీమకుర్తి : K3K స్క్రీన్స్ UFO 2K
ఉండవల్లి : రామకృష్ణ QUBE 2K

DHEERAJ MOGILINENI ENTERTAINMENT LLP
Cont : 8886012228

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292


బాపట్ల కలెక్టరేట్ రోడ్డులో ధర్నా చేస్తున్న ఏపిటిఎఫ్ ఉపాధ్యాయులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్

బాపట్ల, ఫిబ్రవరి 1 : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తున్నదని, ఈ విధానాన్ని విడనాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్.జిలానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎ.శేఖర్‌బాబు అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ తక్షణమే అమలు చేయాలని, బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాగా ఏపీపీఎస్సీ పరీక్షకు వయోపరిమితిని సడలించి మున్సిపల్ ఉపాధ్యాయులకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు జంపాని శ్రీనివాసరావు, బి.నాగాంజనేయులు, డి.రవి, చెంచు రామారావు, చెన్నకేశవులు, కోటయ్య, రాష్ట్ర కౌన్సిలర్ టి.శ్రీనివాసరావు, ఎం.కిషోర్‌బాబు, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు రహంతుల్లా, వెంకటరత్నం, ప్రశాంత్, నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత

● జిల్లా రవాణాశాఖాధికారి ఆర్.సురేష్


సదస్సులో మాట్లాడుతున్న ఆర్.సురేష్

బాపట్ల, ఫిబ్రవరి 1 : రహదారి భద్రత మనందరి బాధ్యత అనే లక్ష్యంతో వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్‌వీలర్ వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని జిల్లా రవాణాశాఖాధికారి ఆర్.సురేష్ తెలిపారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలో గూడ్స్, క్యాబ్, ఆటోడ్రైవర్లు, ప్రైవేట్ విద్యాసంస్థల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రమాదాలు జరగటానికి గల కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు సీహెచ్ రాంబాబు, డీటీవీ రంగారావు, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారులు పి.అంకమ్మరావు, బి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాపట్ల జిల్లా రవాణాశాఖాధికారిగా ఆర్.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న సురేష్‌కు పదోన్నతి కల్పించి ఇక్కడ నియమించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు తదితరులు ఉన్నారు.

హనుమంతరావు సేవలు అభినందనీయం : ఆర్ఎం

బాపట్ల, ఫిబ్రవరి 1 : మూడున్నర దశాబ్దాలుగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో విశేష సేవలందించిన పెట్లూరి హనుమంతరావు సేవలు అభినందనీయమని రీజనల్ మేనేజర్ వీరారెడ్డి అన్నారు. బాపట్ల బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన హనుమంతరావు దంపతులకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వీరారెడ్డి ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడుతూ బాపట్ల ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం హనుమంతరావు దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, ఆంజనేయులు, సుభాష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి : మద్దిబోయన

బాపట్లటౌన్, ఫిబ్రవరి 1 : బీసీల సమస్యల పరిష్కారానికి అన్నివిధాలుగా కృషి చేస్తానని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దిబోయన తాతయ్య అన్నారు. జిల్లా స్థాయి బీసీ కులాల ఐక్యతా సమావేశాన్ని స్థానిక ప్రైవేట్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేశన శంకరరావు నాయకత్వంలో ప్రతి మండలంలో కమిటీలను నియమించి బీసీల ఐక్యతకు కృషి చేస్తామన్నారు. వేమూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆర్.ప్రసాదరావును నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, అంగలకుదురు నటరాజన్, మారం రవికుమార్, శ్రీనివాసరావు, సాంబయ్య, రఘురామయ్య, కిషోర్, నరేష్‌పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో ప్రతిభ చాటిన ఫార్మసీ విద్యార్థి


ఫార్మసీ విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న తాళ్ళూరి రామకృష్ణ

బాపట్లటౌన్, ఫిబ్రవరి 1 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన జాతీయ సెమినార్‌లో బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు చెందిన బీ ఫార్మసీ నాల్గొవ సంవత్సరం విద్యార్థిని కె.హెప్సిబా రూరల్ ప్రజంటేషన్ విభాగంలో యాంటీ హైపర్ లిపిడెమిక్ యాక్టివిట్ ఆఫ్ పైపరిన్ అండ్ స్టిగ్మమా స్టెరోల్ లోడెడ్ మైక్రో స్పెరెస్ అనే అంశంనకు తృతీయ బహుమతి పొందినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి.రామ్మోహనరావు, గెల్లి దిలీప్, జాయింట్ సెక్రటరి, కరస్పాండెంట్ కె.హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణకు కృషి

బాపట్ల, ఫిబ్రవరి 1 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణకు కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ గుంటూరు విభాగప్రముఖ్ పోలంగంగు శ్రీనివాస్ అన్నారు. బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం జరిగింది. సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ హిందుధర్మం కాపాడటంలో మండల సంయోజక్‌లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, మండల కన్వీనర్ మోదడుగు సూరిబాబు, బైసాని అరుణకుమారి, గంగిశెట్టి శ్రీదేవి, జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, సబ్ డివిజన్ ధర్మప్రచారక్‌లు చింతల మురళీ కృష్ణ, అక్కుల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీశ్రేణులు

బాపట్ల, ఫిబ్రవరి 1 : పీసీసీ రథసారధి వైఎస్ షర్మిలారెడ్డి ఈనెల 7న బాపట్లలో పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల చీలురోడ్డుసెంటర్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు రోడ్‌షో చేస్తారన్నారు. కాంగ్రెస్‌పార్టీ పునర్ నిర్మాణం కొరకు, రాష్ట్రానికి ప్రత్యేకహోదా కొరకు ఢిల్లీలో నిరాహారదీక్ష చేయనున్నట్లు వివరించారు. ప్రత్యేకహోదా, రాజధాని నిర్మాణం కాంగ్రెస్‌తో సాధ్యమన్నారు. అనంతరం వెదుళ్ళపల్లికి చెందిన మేడిబోయన గిరిరెడ్డి, జాలాది డేవిడ్‌లకు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈనెల 3న కాపు కళ్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, మాజీ కౌన్సిలర్‌లు నక్కల రాంబాబు, బక్కా రోశయ్య, సీనియర్ నాయకులు వెంకటేశశ్వరరావు, ఎస్‌వీఆర్ కుమార్, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్, ఇస్సాకు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీ రాజుపాలెంలో టీడీపీకి బ్రహ్మరథం


మీమాట-నాబాట కార్యక్రమంలో పాల్గొన్న వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, ఫిబ్రవరి 1 : బాపట్ల నియోజకవర్గంలో ప్రజల మద్దతుతో జనసేన-టీడీపీ సంకీర్ణం ద్వారా భారీ మెజార్టీతో బాపట్ల అసెంబ్లీని కైవశం చేసుకోబోతున్నామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం పంచాయతీ ఎం.వి.రాజుపాలెంలో టీడీపీ, జనసేన పార్టీల ఆదేశాల మేరకు ఇంటింటికి మీ మాట-నాబాట కార్యక్రమాన్ని ఇరుపార్టీల నాయకులతో కలిసి నరేంద్రవర్మ గురువారం పర్యటించారు. ప్రజలకు టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. నరేంద్రవర్మ గురించి వివరించే పుస్తకం, చీర, చేతిసంచి మహిళలకు అందేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రజలందరూ భారీ మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎం.వి.రాజుపాలెం ప్రజలు నరేంద్రవర్మకు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, నాయకులు పిట్ల వసంతరెడ్డి, పులుగు సముద్రాలురెడ్డి, ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ బాజి, రావి రాంబాబురెడ్డి, మాజీ సర్పంచ్ బొద్దుకూరి విజయ, జనసేన మండలాధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర బాబు, బెజ్జం వెంకటేశ్వర్లు, కట్టా సుజాత, దాసు, పఠాన్ కరీముల్లా, పయనం శ్రీనివాసరెడ్డి, జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

టీడీపీలో చేరిన స్టూవర్టుపురం వైసీపీశ్రేణులు

బాపట్ల, ఫిబ్రవరి 1 : మండలంలోని స్టూవర్టుపురం గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు గురువారం టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు రాగాల ప్రసాద్, కర్రెద్దుల రామారావు, గాజుల గాంధి, చుక్కా పాల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరు సైనికునివలే పనిచేసి తెలుగుదేశం విజయానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీలు : సీపీఐ

బాపట్ల, ఫిబ్రవరి 1 : జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆడుదాం- ఆంధ్ర ఆటల పోటీలు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ విమర్శించారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలు షెడ్యూల్ ప్రకారం జరగటంలేదన్నారు. క్రీడాకారులకు సరైన వసతి సౌకర్యం కల్పించలేదని నాణ్యమైన భోజనం పెట్టటంలేదని ఆరోపించారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అధికారులు 15 మంది క్రీడాకారులు సచివాలయం, గ్రామానికి సంబంధించిన వారు కాకపోయినప్పటికి అనుమతిచ్చారని దీనిపై ఫిర్యాదు చేస్తే రెండురోజులుగా కాలయాపన చేస్తూ పట్టించుకోవటంలేదన్నారు. అద్దంకి, పర్చూరు క్రికెట్‌జట్లు మధ్య పోటీ జరగాల్సి ఉండగా అభ్యంతరాలపై విచారించటంలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశించిన డిఎస్‌డివో పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్, నియోజకవర్గ కార్యదర్శి దుండి కనకారెడ్డి పాల్గొన్నారు.

గందరగోళంగా ఆడుదాం ఆంధ్రా

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు జిల్లాలో గందరగోళంగా తయారయ్యాయి. జిల్లా స్థాయి పోటీలు బాపట్లలో జరుగుతుండగా వాటిమీద కనీస నియంత్రణ కూడా కరువై ఎవరికివారే యమునాతీరే అన్న చందాన ఆటలు సాగుతున్నాయి. బుధవారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పోటీలు ఘర్షణకు దారితీయగా తాజాగా గురువారం పర్చూరు టీమ్‌లో స్థానికేతరులు ఉన్నారనిచెప్పి అద్దంకి టీమ్ అబ్జెక్షన్ పెట్టటంతో రసాబాసాగా మారింది. ఆటలను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు పత్తాలేకపోవటంతో ఆటలు కాస్తా గొడవలకు వేదికలై యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఆటలు జరుగుతున్న తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చిత్తశుద్ధితో పనిచేయాలి

బాపట్ల, ఫిబ్రవరి 1 : పట్టణ పారిశుధ్యం మెరుగుదలకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం వార్డులలో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాలలో నిల్వ ఉన్న చెత్తకుప్పలను, డ్రైన్‌లో సిల్ట్‌ను వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. మురుగునీరు, పారిశుధ్యంపై మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శానిటరీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగవిరమణ పొందిన పోలీసులకు సన్మానం

బాపట్ల, ఫిబ్రవరి 1 : జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులకు గురువారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని ఉద్యోగవిరమణ పొందినవారిని సన్మానించి సత్కరించారు. ఇన్‌స్పెక్టర్ కె.మహలక్ష్మీ, ఎస్సై డి.సలోమన్‌రాజు, ఎఎస్సై శ్యామ్‌సుందర్‌లు పోలీసుశాఖలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఎఆర్‌డిఎస్పీ ప్రేమ్‌కుమార్, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.మల్లిఖార్జున్,వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 1 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 4న జరుగుతుందని ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపిపి మత్తి దివాకరరత్నప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పక సమావేశంలో పాల్గొనాలని కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథిలుగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు హజరవుతారని తెలిపారు.

ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన

బాపట్లరూరల్, ఫిబ్రవరి 1 : బాపట్లమండలం నరసాయపాలెం పరిధిలోని ఆది ఆంధ్ర తినంట్స్ కార్పొరేషన్ సొసైటీ కింద ఉన్న 110 మంది లబ్ధిదారులకు 54 ఎకరాల 51సెంట్ల భూమిని పూర్తి హక్కులతో రైతులకు గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి రైతులకు పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా మూలపాలెంలో నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు పథకం కింద 97 కుటుంబాలకు ఇళ్ళ పట్టాలను లబ్ధిదారులకు కోన రఘుపతి పంపిణీ చేశారు.

పెన్షన్‌దారులకు దుప్పట్లు..

బాపట్ల, ఫిబ్రవరి 1 : పట్టణంలోని 8, 13వ వార్డులలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే కోన రఘుపతి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, వెంకట్రావు, ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, చింతల రాజశేఖర్, సికె.నాయుడు, కొత్రా కొండలు, ఇమ్మడిశెట్టి అంకమ్మరావు, దయానందం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బాపట్ల, ఫిబ్రవరి 1 : పట్టణంలోని సంజయ్‌గాంధీకాలనికి చెందిన మేడికొండ ఏసుబాబు (17)ను పనికెందుకు వెళ్ళటంలేదని తల్లిదండ్రులు అడగటంతో రెండు ర్యాట్ కిల్లర్‌లు తెచ్చుకొని తిని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బుధవారం ఈ సంఘటన జరగగా గురువారం యువకుడు మృతి చెందినట్లు తల్లి దయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌బీకే లో పని చేసే వీఏఏ ఆత్మహత్య

వేమూరు, ఫిబ్రవరి 1 : మండలంలోని చావలి రైతు భరోసా కేంద్రంలో వీఏఏగా పని చేస్తున్న పూజిత(23) స్వగ్రామమైన పెరవలిలో తాను నివాసం ఉంటున్న ఇంటిలో గురువారం రాత్రి ఉరివేసుకుని మృతి చెందింది. గ్రామానికి చెందిన సుధాకర్ రెండవ కుమార్తె పూజిత చావలి ఆర్‌బీకేలో ఉద్యోగం చేస్తోంది. ఆర్‌బీకే ద్వారా యూరియా కట్టల అమ్మకంలో రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉండగా ఆమెపై ఒత్తిడి పెరగడంతో మానసిక వేదకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

నేడు అప్పికట్ల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో జనరల్ బాడీ సమావేశం

బాపట్లరూరల్, ఫిబ్రవరి 1 : బాపట్ల మండలం అప్పికట్ల పాలశీతలీకరణ పరిధిలోని పేతన కార్యదర్శుల, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం ఉదయం నిర్వహించటం జరుగుతుందని రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, డైరెక్టర్‌లు బొర్రు రామారావు, దేవిరెడ్డి వెంకటసుబ్బయ్య, మరీదు వెంకటేశ్వరరావు, గొల్లపూడి శ్రీనివాసరావు పాల్గొనటం జరుగుతుందన్నారు.

భట్టిప్రోలు ఎంపీడీవోగా మల్లికార్జునరావు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 1 : భట్టిప్రోలు మండల అభివృద్ధి అధికారిగా జెవిబి మల్లికార్జునరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం నుంచి బదిలీపై మల్లికార్జునరావు భట్టిప్రోలు మండలానికి విచ్చేశారు. విధుల్లో చేరిన మల్లికార్జునరావును ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరిలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఏఓ జలజ, ఈవోపీఆర్డీ ఊహారాణిలతో పాటుగా సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కొల్లూరు ఎంపీడీవోగా లక్ష్మీకుమారి

కొల్లూరు, ఫిబ్రవరి 1 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా బిఎం లక్ష్మీకుమారి బాధ్యతలు చేపట్టారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా మైలవలం నుంచి కొల్లూరుకు ఎంపీడీవోగా బదిలీ అయిన లక్ష్మీకుమారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈవోపీఆర్డీ రవిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీడీవోగా పని చేసిన ఐ.సత్యనారాయణ రావు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు.

అమృతలూరు ఎంపీడీవోగా స్వరూపారాణి

అమృతలూరు, ఫిబ్రవరి 1 : అమృతలూరు ఎంపీడీవోగా స్వరూపారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌సుబానీ బదిలీపై కృష్ణా జిల్లా వెళ్లారు. చినగంజాం ఎంపీడీవోగా పనిచేస్తున్న స్వరూపారాణి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు.

చుండూరు ఎంపీడీవోగా అరుంధతిదేవి

చుండూరు ఫిబ్రవరి 1 : మండల అభివృద్ధి అధికారిగా జి.అరుంధతి దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఆమె కృష్ణాజిల్లా వీర్లపాడు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న టి.సుగుణమ్మ ప్రకాశం జిల్లా మద్దిపాడుకు బదిలీ అయ్యారు.

నిజాంపట్నం ఎంపీడీవోగా దేవసేనకుమారి

రేపల్లె, ఫిబ్రవరి 1 : నియోజకవర్గంలోని నిజాంపట్నం ఎంపీడీవోగా ఆర్.దేవసేనకుమారి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపిడివో ఎస్.నాగలక్ష్మీ కృష్ణాజిల్లా చల్లపల్లి మండలానికి బదిలీపై వెళ్ళారు.

వేమూరు ఎంపీడీవోగా శేషగిరిరావు

వేమూరు, ఫిబ్రవరి 1 : ఎంపీడీవోగా జీవీఎస్ శేషగిరిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవోల బదిలీలతో పాటు ఖాళీలను భర్తీ చేస్తున్న ప్రక్రియలో భాగంగా కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో పని చేస్తున్న జీవీఎస్ శేషగిరిరావును వేమూరుకు బదిలీ చేశారు. ఆయన ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ నుంచి పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో, ఈఓపిఆర్‌డి శేఖర్ కార్యాలయ సిబ్బంది, పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శులు ఆయనకు బొకే అందించి స్వాగతం పలికారు.

బాపట్ల ఎంపీడీవోగా విజయశేఖర్

బాపట్ల, ఫిబ్రవరి 1 : బాపట్ల ఎంపీడీవోగా పర్రె విజయశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎ.రాధాకృష్ణ పదోన్నతిపై బదిలీ కావటంతో ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా కందుకూరులో పని చేస్తున్న విజయశేఖర్‌ను ఇక్కడ నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయశేఖర్‌ను ఈవోపీఆర్డీ పులి శరత్ బాబు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి జేబీఎస్ రజనీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కర్లపాలెం ఎంపీడీవో నేతాజి

కర్లపాలెం, ఫిబ్రవరి 1 కర్లపాలెం ఎంపీడీవోగా నేతాజి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న దాసరి రాంబాబు బదిలీపై వెళ్ళగా నేతాజి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది నేతాజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, పూలదండలతో స్వాగతంపలికారు. నేతాజి మాట్లాడుతూ కర్లపాలెం మండలంలోని అన్ని పంచాయతీలను అభివృద్ధిలో నడిపించటానికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, కార్యదర్శులు మోడి శ్రీనివాసరావు, రాంబాబు, వీరాస్వామి రెడ్డి, పద్మావతి, వెంకటేశ్వరరావు తదితరులుఉన్నారు.

తన్నీరు చారిటబుల్ ట్రస్టు వితరణ

చుండూరు, ఫిబ్రవరి 1 : విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి వారికి తగిన ప్రోత్సాహం అవసరమని తన్నీరు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న వితరణలో భాగంగా గురువారం మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు మోడల్ టెస్టు పేపర్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం గుదిమెళ్ళ రామారావు, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బసవమ్మ మృతి పార్టీకి తీరని లోటు

రేపల్లె, ఫిబ్రవరి 1 : నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు బొర్రాబసవమ్మ అకాల మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ అన్నారు. గురువారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొర్రా సురేంద్ర, బొర్రా సాంబయ్య, తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, కేసన మధు, అడవులదీవి ఎంపీటీసీ మేకా రాజేష్‌కన్నా, నల్లపాటి యల్లయ్య పాల్గొన్నారు.

జిల్లాలో పెద్దఎత్తున పోలీసుల బదిలీలు

బాపట్ల,ఫిబ్రవరి 1 : జిల్లాలో పెద్దఎత్తున పోలీసులను బదిలీ చేశారు. ఈమేరకు గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఎం.శివకుమార్‌ను ఈపూరుపాలెం పోలీసుస్టేషన్‌కు ఎం.శివయ్యను కొరిశపాడు పోలీసుస్టేషన్‌కు వి.వేమనను చీరాల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు, ఎస్‌వి రవీంద్రరెడ్డిని కొల్లూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇంకొల్లు ఎస్సై ఎస్‌కె.నాయిబ్ రసూల్‌ను డిటిసికి, మార్టూరు ఎస్సై ఎం.శ్రీనివాసరావును చినగంజాం పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అద్దంకి అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్సై జె.నాగరాజును విఆర్‌కు, బాపట్ల టౌన్ ఎస్సై ఎస్‌కె.మహ్మద్ రఫీని బాపట్ల డీఎస్‌బికి, నిజాంపట్నం ఎస్సై ఎస్.రమేష్‌ను వీఆర్‌కు కారంచేడు ఎస్సై జి.శ్రీనివాసరావును బాపట్ల డీఎస్‌బీకి, పర్చూరు ఎస్సై వీఆర్ శంకర్‌రెడ్డిని డీసీఆర్‌బీకి, వెదుళ్ళపల్లి ఎస్సై జి.నవీన్‌కుమార్‌ను అమర్తలూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద రైతు కుటుంబాల ఆందోళన

● తమ ఆధీనంలో ఉన్న భూమికి మరొకరికి పట్టా ఇచ్చారని ఆరోపణ

కొల్లూరు, ఫిబ్రవరి 1 : తమ ఆధీనంలో ఉన్న భూమిలో 16 సెంట్లకు సంబంధం లేని వ్యక్తికి పట్టా ఇచ్చారంటూ రైతు కుటుంబాలు ఆందోళనకు దిగాయి. గురువారం మండల పరిధిలోని చింతల్లంక గ్రామానికి చెందిన మూడు కుటుంబాల వారు కౌలు రైతు సంఘం నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఎప్పటి నుంచో తమ ఆధీనంలో ఉన్న 3 ఎకరాల 12 సెంట్లు భూమిలో 16 సెంట్లు తమ కుటుంబ సభ్యులతో పాటు మరొక వ్యక్తికి పట్టా ఎందుకు ఇచ్చారంటూ అధికారులను ప్రశ్నించారు. తహసీల్దార్ ఈ విషయంపై సర్వేయర్‌తో మాట్లాడి నిబంధనలకు విరుద్ధంగా పట్టా మంజూరు చేస్తే రద్దు చేస్తామని చెప్పినా వినకుండా కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ క్రమంలో పట్టా పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నవ్యక్తి కుటుంబానికి చెందిన రత్నాకర్ అనే వ్యక్తి, రైతు కుటుంబాల వారు కార్యాలయ ఆవరణలోనే ఘర్షణ పడి ఒకరినొకరు కొట్లాటకు దిగారు. రత్నాకర్ అనే వ్యక్తికి స్వల్పంగా గాయాలు కావడంతో అతను పోలీస్‌స్టేషన్‌లో తనను కొట్టినట్లుగా ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఎస్ఐ నాగరాజా ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. కొట్లాటపై పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు తెలుస్తోంది. రైతు కుటుంబాల వారు ఆరోపించిన విధంగా మరొకరికి పట్టా మంజూరు చేయలేదని, మంజూరు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని, వాటిని వెంటనే నిలుపుదల చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్‌తో వారి ఆధీనంలో ఉన్న భూమి కొలతలు వేయించి తగిన న్యాయం చేస్తామని రైతు కుటుంబాల వారికి హామీ ఇచ్చారు.

ఇంటిలో పేలిన గ్యాస్ సిలిండర్

● ప్రాణాపాయం నుంచి బయట పడిన వృద్ధుడు


గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమవుతున్న గృహం

కొల్లూరు, ఫిబ్రవరి 1 : గ్యాస్ లీకై ఇంటిలోని సిలిండర్ పేలి వృద్ధుడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సుగ్గునలంక గ్రామంలో సుగ్గున శ్రీరంగనాయకులు అనే 90 ఏళ్ల వృద్ధుడు పూరింటిలో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. స్నానం చేసేందుకు కట్టెల పొయ్యిపై నీళ్ల కాచుకుంటుండగా ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ద్వారా గ్యాస్ లీకై ఒక్కసారిగా కట్టెల పొయ్యి నుంచి మంటలు ఇంట్లోకి వెళ్లి ఇంటి కప్పులను తాకాయి. చుట్టుపక్కల వారు పెద్దగా కేకలు వేయడంతో ఇంటి బయట ఉన్న వృద్ధుడు రోడ్డు మీదకు వెళ్లగా ఒక్కసారిగా సిలిండర్ పేలిపోయింది. పేలుడు ధాటికి సిలిండర్ ముక్కలు పక్కనే ఉన్న గడ్డివామి, పూరింటిపై పడ్డాయి. ఈ ఘటనలో వృద్ధుడు స్వల్పంగా గాయపడ్డాడు. తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, వేమూరు సిఐ పి.రామకృష్ణ ఆ గ్రామానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి వృద్ధుడిని పరామర్శించారు. సిఐ వ్యక్తిగత సాయంగా వృద్ధునికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, పండ్లు, రూ.5 వేల నగదు అందజేశారు. తహసీల్దార్ ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్మును త్వరితగతిన అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అధికారుల నిర్లక్ష్యంతో గోవాడ ఆలయానికి రూ.6 లక్షల నష్టం

● గత ఏడాది కన్నా తక్కువకు ఖరారు చేసిన వేలంపాట


టెండర్లు తెరుస్తున్న ఛైర్మన్ రమాదేవి, ఈవో అశోక్‌కుమార్, ఆలయ సిబ్బంది

అమృతలూరు, ఫిబ్రవరి 1 : అధికారులు, పాలక మండలి సభ్యుల నిర్లక్ష్యంగా కారణంగా ఆలయానికి రూ.6 లక్షల నష్టం వాటిల్లింది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 96 సెంట్లు ఖాళీ భూమికి వేలంను గురువారం నిర్వహించారు. ఈ స్థలంలో వినోద పరికరాలతోపాటు, వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. గత ఏడాది ఈ ఖాళీ స్థలంకు 18లక్షల 71 వేలకు గుత్తేదారు సొంతం చేసుకున్నారు. ఈ ఏడాదికి గురువారం వేలం పాట నిర్వహించగా అధికార పార్టీ నేత సిపార్సు చేసిన వ్యక్తికి దక్కేలా పావులు కదిపారు. గతంలో వేలం పాట నిర్వహించగా పోటా పోటీగా పాట దారులు వేలం పాటలో పాల్గొనగా ఇప్పడు ఆరుగురు మాత్రమే పాల్గొన్నారు. ఇందులో కూడా వేలం పాట హెచ్చుపోకుండా సిండికేట్ వ్యవహారం బయటకు రాకుండా వేలం పాట నిర్వహించగా ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ వేలం పాటను రూ.13లక్షల 5 వేలకు దక్కించుకోవడం గమనార్హం. పాలకమండలిలోని తగాదాలు, దేవాదాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆలయంకు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

నిబద్ధతగల ఉద్యోగి డాక్టర్ అమర్నాధ్


డాక్టర్ అమర్నాధ్‌ను సత్కరిస్తున్న వెటర్నరీ డాక్టర్ కేదారేశ్వర

వేమూరు, ఫిబ్రవరి 1 : నిబద్దత గల ఉద్యోగి డాక్టర్ అమర్నాధ్ అని పశుసంవర్థశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేదారేశ్వర కొనియాడారు. వేమూరు మండలం జంపని గ్రామీణ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పని చేసి పదవీ విరమణ పొందిన అమర్నాధ్ వీడ్కోలు సభా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి వేమూరు సహాయ సంచాలకులు డాక్టర్ కె.వి.జనార్ధన్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేదారేశ్వర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచి సేవలు అందించి రైతుల నుంచి, పశుసంవర్ధ శాఖ నుంచి మంచి గుర్తింపు పొందిన వ్యక్తి అని ప్రశంశించారు. ఏడి జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యత విషయంలో ఎలాంటి మచ్చ లేకుండా మంచి ఉద్యోగిగా మన్ననలు పొందారన్నారు. కృష్ణాజిల్లా డిఎల్‌డిఏ ఈవో డాక్టర్ శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా డిఎల్డీఏ ఈవో డాక్టర్ బాల శంకరరావు, తెనాలి ఏడి డాక్టర్ బి.నాగిరెడ్డి, చావలి వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ చలపతిరావు, రేపల్లె ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ గోగినేని నరేంద్రబాబు, వెటర్నరీ విభాగం గ్రాడ్యుయేట్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయసారధి, డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్, తెనాలి ఎన్జీవోస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, డాక్టర్ ధనుంజయ, రిటైర్డ్ అధికారి ఆలపాటి వెంకట్రామయ్య, సంబంధిత శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రసంగించి అమర్నాధ్ సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు.

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా రాయన

భట్టిప్రోలు, ఫిబ్రవరి 1 : బీసీ సంక్షేమ సంఘం నియోజవర్గ అధ్యక్షుడిగా మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన రాయన ప్రసాద్ నియమితులయ్యారు. బాపట్లలో గురువారం జరిగిన కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై శాయశక్తులా కృషి చేస్తానన్నారు. బీసీ నాయకులు రాయన ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఈడె శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు మద్దిబోయిన తాతయ్య, బీసీ నాయకులు కూరపాటి రఘురామయ్య, యరగళ్ళ నాంచారయ్య, రమేష్ పాల్గొన్నారు.

నేడు వేమూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు, ఫిబ్రవరి 1 : విద్యుత్ మరమ్మతుల నిమిత్తం వేమూరులో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ గోపి తెలిపారు.



పర్చూరులో గోటితో తలంబ్రాలను సిద్ధంచేస్తున్న మహిళా భక్తులు

కోటి తలంబ్రాల సేకరణలో మహిళా భక్తులు

» సీతారాముల కల్యాణానికి సిద్ధంచేస్తున్న వైనం

పర్చూరు, ఫిబ్రవరి 1: గోటి కోటి తలంబ్రాల కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని భక్తిని చాటుతున్నారు. భద్రాద్రిలో సీతారాముల కల్యాణ కార్యక్ర మానికి సంబంధించిన తలంబ్రాలను గోటితో వలచి సిద్ధం చేస్తున్నారు. పర్చూ రులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అద్దంకి నాంచారమ్మ భక్త సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్రం జైశంకర్ భూపాల్‌పల్లి జిల్లా, గణపవరం మండలం, చేల్పూరు గ్రామానికి చెందిన రామదాసు భక్తమండలి పంపిన తలంబ్రాలకు సంబంధించిన ధాన్యాన్ని మహిళా భక్తులు గోటితో ఒలిచి సిద్ధంచేసే పనిలో నిమగ్నమయ్యారు. స్వామివారి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనే అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నామని మహిళా భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వామివార్ల తలంబ్రాలను రామదాసు, తిరుపతి దంపతులు పంపినట్లు సేవా సమితి ప్రతినిధులు కఠారి సత్యం, కొసనా వెంకటేశ్వర్లు తెలిపారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

చీరాల, ఫిబవరి 1: సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్‌మహీంద్ర కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 30 మంది బీటెక్ ఆఖరి సంవత్స రం చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈసందర్భంగా గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇటీవల టెక్‌మహీంద్ర కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 331 మంది హాజరుకాగా, 30 మంది ఎంపికయినట్లు వివరించారు. వారిలో సీఎస్ఈ నుంచి 19 మంది, ఈసీఈ నుంచి నలుగురు, ఏఐఎంఎల్ నుంచి నలుగురు, ఐవోటీ నుంచి ముగ్గురు ఎంపికయ్యారన్నారు. కార్యక్ర మంలో ఆయా విభాగాధిపతులు డాక్టర్ హరిణి, డాక్టర్ జగదీష్, డాక్టర్ హరికి షన్, డాక్టర్ ఇంద్రనీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకి ఎంపీడీవోగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 1: అద్దంకి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా గురువారం జీవీ సత్యనారాయణ బాధ్యతలు తీసుకున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి బదిలీపై వచ్చారు. ముందుగా సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవో పనిచేసిన దేవసేన కుమారి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్ళారు.

తహసీల్దార్‌గా మహబూబ్ సుభాని

అద్దంకి, ఫిబ్రవరి 1: అద్దంకి తహసీల్దార్‌గా మహబూబ్ సుభానిని నియమిస్తూ కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులు ఇచ్చారు. పెదనందిపాడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుభానిని ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్బారెడ్డిని నెల్లూరు జిల్లాకు కేటాయించారు.

కొరిశపాడు ఎంపీడీవోగా సమతావాణి

మేదరమెట్ల , ఫిబ్రవరి 1: కొరిశపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.సమతావాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబును సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా దుర్గి మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న సమతావాణిని నియమించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆమె పంచాయతీ అధి కారులతో సమావేశం నిర్వహించారు.

అలాగే, కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌కు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా కె.శివయ్యను బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జీవీ చౌదరిని వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న శివయ్యను కొరిశపాడు ఎస్ఐగా బదిలీ చేశారు.

బీసీలకు సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 1: రాజ్యాంగ పరంగా బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ కె.శంకర్‌నారాయణను కోరారు. గురువారం బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్‌ను బీసీ సంఘం నాయకలు కలిసి మెమోరాండం అందజేశారు. శంకర్‌నారాయణతో పాటు నూతన కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుందుర్తి గురువాచారిని కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతిగా చెప్పుకోవడం దుర్మార్గం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 1: రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం రైతుపక్షపాతిగా చెప్పుకోవడం దుర్మార్గంగా ఉందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి మండిపడ్డారు. రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. రైతుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు బొంతల కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుమారస్వామి మాట్లాడుతూ ఐదు లక్షల ఎకరాల సాగు, 15 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పశ్చిమ ప్రాంతంలో నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2005లో ప్రారంభించినా ఇంత వరకు పూర్తిచేయలేదన్నారు. టన్నెల్ పనులను పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు ఆర్‌అర్ ప్యాకేజీని అందించాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకొని పోయినా ఆ గేట్ల స్థానంలో కొత్త గేట్లు పెట్టేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దర్మార్గంగా ఉందన్నారు.

ఇటీవల మిచౌంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం ఆదుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



గుంటూరు	: భాస్కర్ సినిమాస్ QUBE 2K
గుంటూరు	: The Cinemas QUBE 2K
గుంటూరు	: V- ప్లాటినో QUBE 4K
గుంటూరు	: JLE CINEMAS UFO 2K
గుంటూరు	: సినీప్రైమ్ QUBE 2K
గుంటూరు	: శివా QUBE 2K
గుంటూరు	: సినీస్క్వేర్ QUBE 2K
గుంటూరు	: KKR సాయినివ్య QUBE 4K
గుంటూరు	: గౌరిశంకర్ QUBE 4K
ఒంగోలు	: కృష్ణ QUBE 2K
ఒంగోలు	: రవి ప్రియ QUBE 2K
తెనాలి	: లక్ష్మీ QUBE 2K
నరసరావుపేట	: రవి కళామందిర్ QUBE 2K
నరసరావుపేట	: విజేత QUBE 2K
చిలకలూరిపేట	: KR కాంప్లెక్స్ QUBE 2K
మంగళగిరి	: అన్నపూర్ణ QUBE 2K
సత్తెనపల్లి	: శ్రీనివాస QUBE 2K
వినుకొండ	: కీర్తి QUBE 2K
మాచర్ల	: శ్రీనివాసమహల్ QUBE
అద్దంకి	: కళామందిర్ QUBE 2K
రేపల్లె	: బసవేశ్వర QUBE 2K
పిడుగురాళ్ళ	: గంగామమల్ QUBE 2K
చీరాల	: మోహన్ QUBE 2K
బాపట్ల	: శ్రీనివాస QUBE 2K
పొన్నూరు	: విన్‌టేజీ సినిమాస్-1 QUBE 2K
చీమకుర్తి	: K3K స్క్రీన్స్ UFO 2K
ఉండవల్లి	: రామకృష్ణ QUBE 2K

DHEERAJ MOGILINENI ENTERTAINMENT LLP
Cont : 8886012228

శింగరకొండ దేవస్థానం పాలకమండలి నియామకం లేనట్టేనా!

» చివరి నిమిషంలో బ్రేక్ పడిన ఉత్తర్వులు
» వైసీపీలో అంతర్యుద్ధంతో ఆశావహుల్లో నిరుత్సాహం
» పది నెలలుగా ఎదురుచూపులే!



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

అద్దంకి, ఫిబ్రవరి 1: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి నియామకం ప్రస్తుత ప్రభుత్వంలో జరిగే అవకాశాలు లేనట్లేనని పలువురు ఆశావహులు నిరుత్సాహం చెందుతున్నారు. గతంలో సుమారు పుష్కరకాలం పాటు పాలకమండలి నియామకం జరగలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు రెండేళ్ళకు పాలకమండలి నియామకం జరిగింది. చైర్మన్‌గా కోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత ఏడాది మార్చి నెలతో పాలక మండలి గడువు ముగిసింది. అప్పటి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్యతో కోట శ్రీనివాసరావుకు సత్సంబంధాలు లేకపోవటంతో, అనంతరం కొత్త వ్యక్తులను నియమించే విధంగా ఏర్పాట్లు జరిగాయి.

కొత్త పాలకమండలి నియామకానికి సంబంధించి అక్టోబర్‌లో ఉత్తర్వులు వచ్చినా చివరి నిమిషంలో బ్రేక్ పడింది. ఈలోపు వైసీపీ ఇన్‌చార్జ్‌గా పాణెం హనిమిరెడ్డి రావటంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. పాత ఉత్తర్వులు బుట్టదాఖలు అయ్యాయి. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ఈ ప్రభుత్వంలో కొత్త పాలక మండలి నియామకం జరగటం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. దీంతో చైర్మన్ పోస్టు ఆశించిన పలువురు ఆర్యవైశ్యులు నిరుత్సాహానికి గురయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో రెండు పాలకమండళ్ళ పూర్తికాలం పనిచేసే అవకాశం ఉన్నప్పటికి ఒక పాలకమండలితో సరిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నేతల మధ్య అంతర్యుద్ధం వల్లనే ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి నియామకం జరగలేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ ప్రభావం వచ్చే ఎన్నికలలో ఆర్యవైశ్య ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్యులలో వైసీపీ ఓటింగ్ శాతం ఇప్పటికే అంతంతమాత్రంగా ఉండగా చైర్మన్ నియామకం జరగకపోవటం ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కోక తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగిఉండాలి

» నిబంధనలకనుగుణంగా విధులు నిర్వహించాలి
» బాపట్ల ఆర్డీవో రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్

పర్చూరు, ఫిబ్రవరి 1: ఎన్నికల నియమావళిపై అవగాహన కల్గిఉండాలి, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. గురువారం స్థానిక రోటరీ భవనంలో పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సెక్టోరియల్ అధికారులు, పోలీసుశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధి విధానాలపై డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బుక్‌లెట్‌లో పొందుపరిచిన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాల్సిన బాధ్యతసెక్టోరియల్ అధికారిదే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. గుర్తింపు కార్డు ఉన్న వ్యక్తులను మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు ముందు విధిగా ఆయా రాజకీయపార్టీల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల మధ్యలో ఈవీఎంలు మొరాయిస్తే ఉన్నత అధికారుల అనుమతితో మరో ఈవీఎంను ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఉన్నతాధికారులు వస్తే వారి వివరాలు విజిట్‌బుక్‌లో నమోదు చేయాలన్నారు. ఓటు కోసం వచ్చిన వ్యక్తి సంతకం 17(ఎ) సెక్షన్‌లో పొందుపరిచిన విధంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌కు వచ్చే ముందు సామగ్రిని పరిశీలించి తగిన విధంగా సిబ్బంది ఉన్నారా, లేరా అన్నవిషయాన్ని గ్రహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేసే విధంగా అధికారులు కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాలకు చెందిన సెక్టోరియల్ ఆఫీసర్లు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పర్చూరు తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. తహసీల్దార్ సంధ్యశ్రీ, సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

ఓవైపు కళాశాల, హైస్కూల్‌లో తరగతులు.. మరోవైపు సంబరాలు



ఆసరా చెక్కులు అందజేస్తున్న హనిమిరెడ్డి, ఎస్తేరమ్మ

అద్దంకి/బల్లికురవ, ఫిబ్రవరి 1: స్వయం సహాయక సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాలలో భాగంగా గురువారం అద్దంకి పట్టణంలోని స్వయం సహాయక సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో, బల్లికురవలో మండల సమాఖ్య ఆధ్వర్యంలలో చెక్కులను హనిమిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, కమిషనర్ శ్రీనివాసులు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాగా, అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆసరా చెక్కుల పంపిణీ సంబరాలు ఏర్పాటుచేశారు. మైకుల మోతలతో అటు కళాశాల, ఇటు హైస్కూల్ విద్యార్థుల చెవులు రింగుమన్నాయి. విద్యార్థుల ధ్యాస మొత్తం మైదానం వైపు ఉండటంతో వాళ్ళను అదుపు చేయటంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఇబ్బందులుపడ్డారు. వైసీపీ నేతలు మాత్రం విద్యార్థుల సంగతి మాకెందుకు, మా సంబరాలు మాకు ముఖ్యమన్న విధంగా వ్యవహరించటం విమర్శలకు తావిచ్చింది.

గ్రానైట్ యాజమాన్యాల అరెస్టులో కుట్ర

» దాడులు, అరెస్టులు ఉద్దేశపూర్వకమే!
» పోలీసుల తీరు హేయం
» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, ఫిబ్రవరి 1: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రతిపక్ష పార్టీకి చెందిన పారిశ్రామిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తూ కార్మికుల జీవనాన్ని పూర్తిగా దెబ్బతీశారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్టూరు గ్రానైట్ పరిశ్రమలపై మైనింగ్ అధికారులు వైసీపీ రౌడీలతో వచ్చి దాడులు నిర్వహించిన సంఘటనలో వారిని పోలీసులకు అప్పగించినా పారిశ్రామిక యాజమాన్యంపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వకంగా తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలపై దాడులు నిర్వహించారని మండిపడ్డారు. మారణాయుధాలు, కారంపొట్లాలు, కర్రలతో వచ్చినవారిని వదిలి, వారిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పరిశ్రమల యాజమాన్యం, తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయటం హేయమైన చర్య అన్నారు. వేలాది మంది కార్మికులతోపాటు, ఇతర రాష్ట్రాల కార్మికులకు జీవనోపాధిని అందిస్తున్న పరిశ్రమలపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రభుత్వ చర్యలతో గ్రానైట్ పరిశ్రమలు మూతపడే దిశగా తీసుకుపోయిన ఘనత ప్రభుత్వ పెద్దలకే దక్కుతుందన్నారు. తక్షణమే మైనింగ్ అధికారులు కక్షపూరిత ధోరణిని నిలిపివేసి పారిశ్రామికోన్నతికి తోడ్పాడు అందించాలన్నారు.

ఫిర్యాదు చేసిన వారిపై కేసులా..

మార్టూరు గ్రానైట్ పరిశ్రమల్లో మైనింగ్ అధికారులతో వచ్చిన వైసీపీ రౌడీ మూకలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన గ్రానైట్ యాజమాన్యాలపై కేసు నమోదు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. దాడులు చేసిన వారిని వదిలి పరిశ్రమల యాజమాన్యంపై తప్పుడు కేసులు బనాయించటం వైసీపీ ప్రభుత్వ పెద్దల నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అధికార పార్టీకి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఏలూరి పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగా అరెస్టులు

రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై దాడులు చేసి అరెస్టులు చేశారని, కేసులు, కోర్టులో ప్రవేశ పెట్టడంలోనూ జాప్యం చేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈనెల 30న ఫిర్యాదు చేయటానికి వెళ్ళిన గ్రానైట్ పరిశ్రమ యాజమాన్యాలు, పార్టీ నాయకులను స్టేషన్‌లో బలవంతంగా ఉంచి రాత్రి మొత్తం స్టేషన్‌లోనే కూర్చోపెట్టారన్నారు. మరుసటిరోజు 31వ తేది ఉదయం 7 గంటలకు అద్దంకి కోర్టుకు తీసుకువెళ్ళి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రిమాండ్ నిమిత్తం హాజరు పర్చకుండా పోలీసులు ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేశారన్నారు. దీనికి వెనుక కుట్రకోణం దాగి ఉందని ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు రాజకీయ పక్షపాతం లేకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, పోలీసుపై నమ్మకం పెంచాలని హితవు పలికారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

» ధర్నాలో ఏపీటీఎఫ్ డిమాండ్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 1: మునిసిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ వెంటనే అమలు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్‌మంజుల డిమాండ్ చేశారు. మునిసిపల్, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నాలో మంజుల మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలను అనుసరించి పదోన్నతులనువెంటనే చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా మునిసిపల్ పాఠశాలల విస్తరణ జరగలేదని, ప్రభుత్వం చిత్తశుద్ధితో మునిసిపల్ పాఠశాలలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి. రఘుబాబు మాట్లాడుతూ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎంఈవో, డిప్యూటీ డీఈవోల పోస్టులను మంజూరు చేయాలన్నారు.

కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఐ.విజయసారథి, నాయబ్‌రసూల్, శేషారావు, కె.తిరుమల, పి. హనుమంతరావు, రాజశేఖరరెడ్డి, లేవీ ప్రసాద్, ఎస్‌కే బషీరున్నీసా, కె.శ్రీనివాసరావు, కె.రవి, ఖాదర్‌బాషా, ఎం.శ్రీనివాసరావు, పి.సుబ్బారావు, టి.సుబ్బారావు, టి.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పచ్చాకు ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి

మద్దిపాడు, ఫిబ్రవరి 1: పచ్చాకు ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందిన సంఘటను గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఘడియపూడి కాలువకట్ట ఎగువన గడ్డం చెన్నయ్య అనే రైతుకు పొగాకు పనుల నిమిత్తం రాచవారిపాలెం దళితవాడకు చెందిన పలువురు కూలీలు ట్రాక్టర్‌లో వచ్చారు. ట్రాక్టర్‌కు పచ్చాకు నింపి ఇంటికి వచ్చే క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడింది.

ఈ ప్రమాదంలో ట్రాలీ కిందపడి సుదర్శి శోభారాణి (38) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. యాదాల యల్లమ్మ, గోగులమూడి శుభ అనే మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కూలినాలి చేసుకొని జీవనం సాగిస్తున్న శోభారాణి మృతి చెందడంపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీవనోపాధికి వెళితే జీవితమే పోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానికుల సమాచారం మేరకు మద్దిపాడు ఎస్ఐ బుదాల శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమిషనర్‌గా అహ్మద్ రషీద్ బాధ్యతల స్వీకరణ



అహ్మద్ రషీద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేనేజర్ శ్రీదేవి

అద్దంకి, ఫిబ్రవరి 1: అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా అహ్మద్ రషీద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాసులు రామచంద్రాపురం బదిలీ కాగా నూజివీడు నుంచి అహ్మద్ రషీద్ వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రషీద్‌కు మేనేజర్ శ్రీదేవి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చినగంజాం ఎంపీడీవోగా వరప్రసాద్

చినగంజాం, ఫిబ్రవరి 1: చినగంజాం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా యూబీ వరప్రసాద్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా మాచవరం ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో కె.స్వరూపరాణి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి నుంచి వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోని మండల ప్రజాపరిషత్ కార్యలయ సిబ్బంది, ఉపాధిహామీ పథకం కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల గ్రామ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పంగులూరు ఎంపీడీవో మృత్యుబాబు

పంగులూరు, ఫిబ్రవరి 1: పంగులూరు ఎంపీడీవో మృత్యుబాబు నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం జరిగిన బదిలీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం నుంచి పంగులూరుకు బదిలీ అయ్యారు. గురువారం ఆయన విధులు చేపట్టారు.

సంతమాగులూరు ఎంపీడీవోగా కాశయ్య

సంతమాగులూరు, ఫిబ్రవరి 1: సంతమాగులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.కాశయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధరణ బదిలీలలో భాగంగా ఆయన సంతమాగులూరుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో జి.కాశయ్యను కలసి అభి నందనలు తెలిపారు.

మార్టూరు ఎస్ఐ బదిలీ

మార్టూరు, ఫిబ్రవరి 1: మార్టూరు ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు చినగంజాం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మూడు నెలల క్రితమే ఆయన ఇక్కడికి వచ్చారు. గురువారం సాయంత్రం ఆయన మార్టూరు నుంచి రిలీవ్ అయ్యారు.

ఈపూరుపాలెం ఎస్సైగా శివకుమార్

చీరాలటౌన్, ఫిబ్రవరి 1: ఈపూరుపాలెం ఎస్సైగా ఎంవీ శివకుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. చీరాల వన్‌టౌన్ ఎస్సైగా వేమనను నియమించారు. ప్రస్తుతం వీరిద్దరు జిల్లా వేకెన్సీ రిజర్వులో ఉన్నారు. సోమవారం వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఈపూరుపాలెం ఎస్సైగా ఉన్న పెనుమాల జనార్దన్ కర్లపాలెం ఎస్సైగా బదిలీ అయ్యారు.

ఎస్‌హెచ్‌వోగా రాజశేఖర్ రెడ్డి

మార్టూరు, ఫిబ్రవరి 1: మార్టూరు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఎస్సీ రాజశేఖర్ రెడ్డి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఆయన మార్టూరుకు బదిలీ అయ్యారు.

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం



మసీదు సెంటర్లో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

చీరాల, ఫిబవరి 1: స్థానిక మసీదు సెంటర్లో నూతనంగా నిర్మించిన డ్రైయిన్లు, సీసీ రోడ్డుతో దశాబ్దాలకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారమైంది. గతంలో ఏ చిన్నపాటి వర్షం వచ్చినా అక్కడ వర్షపునీటితో చెరువును తలపించేది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో నిర్మించిన డ్రైయిన్లు సరైన గమనంలో లేకపోవటంతో మురుగు పారుదల సక్రమంగా ఉండేదికాదు. ఒకింత ఆలస్యం అయినా సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం కావాలనే ఉదేద్దశంతో డ్రైయిన్లు, సీసీ రోడ్ల పనులను రెంటింటి ని సమతూకంగా చేపట్టంతో ఎట్టకేలకు దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.

సబ్సిడీతో బోట్లు, వలలు, ఇంజన్లు పంపిణీ

చినగంజాం, ఫిబ్రవరి 1: మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 60 శాతం సబ్సిడీతో బోట్లు, వలలు, ఇంజన్లు అందజేయనున్నట్లు గ్రామ మత్స్య సహాయకులు ఎస్.పుల్లారావు తెలిపారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పు పల్లెపాలెం రామాలయం ఆవరణలో ఎనిమిదో విడత మత్స్య సాగుబడిపై గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సముద్రంలో వేటచేసే సమయంలో ప్రతి బోటులో సముద్ర రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయిలు, జీపీఎస్ హ్యాండ్ సెట్లు కలిగి ఉండాలని పుల్లారావు సూచించారు. మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాగరమిత్రులు జి.లావణ్య, పి.తేజస్విని, గ్రామ పెద్దలు, బోటు యజమానులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

నేడు మార్టూరులో విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

మార్టూరు, ఫిబ్రవరి 1: మండల కాంప్లెక్స్ వద్ద రూ.2.5 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నారు. ఈ సబ్‌స్టేషను ద్వారా మార్టూరు గ్రామంలో జాతీయరహదారికి పడమర వైపున ఉన్న విద్యానగర్, మద్ది సీతాదేవి కాలనీ, నాగరాజుపల్లి రోడ్డు, ఎంఎల్‌పీ కంపెనీ ఏరియా, బాలాజీ అపార్ట్‌మెంట్ ఏరియా, సంపత్ నగర్, తదితర కాలనీలలో లోఓల్టేజీ సమస్య తీరుతుంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై నేడు చలో చినగంజాం

చినగంజాం, ఫిబ్రవరి 1: మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై జనసేన పార్టీ నిరంతర పోరాటం చేస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్ అన్నారు. స్థానిక సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో జనసేన మండల పార్టీ ఆధ్వర్యంలో చలో చినగంజాం గోడ పత్రికను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చినగంజాం ప్రాంతంలోని ప్రభుత్వ భూములలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం చలో చినగంజాం కార్యక్రమానికి పిలుపు నిచ్చినట్లు చెప్పారు. అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతూ ప్రకృతి విధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల కళ్ళ ఎదుటే ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. స్థానికంగా ఉన్న సహజ వనరలని కాపాడుకోవడంలో భాగంగా మన ఊరు- మన ఇసుక- మన బాధ్యత అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు బుడే కన్నుమూత



మహమ్మద్ బుడే (ఫైల్)

మార్టూరు, ఫిబ్రవరి 1: శ్రీవిఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మహ మ్మద్ బుడే (59) అనారోగ్యంతో గురువారం వేకువజామున మృతి చెందాడు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి పరిస్థితి విషమంగా మారడంతో మార్టూరుకు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, కు మారుడు, కుమార్తె ఉన్నారు.

మార్టూరు ప్రాంతంలో కూరగాయల బుడేగా రైతులకు, రాజకీయ నాయకులకు, ప్రజానీకానికి అందరికీ ఆయన సుపరితుడు. చుట్టుపక్కల బాపట్ల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు తదితర జిల్లాలో దేవాలయాల ధ్వజస్తంభాల ప్రతిష్ఠ, మాలధారులకు అన్నదానం, తదితర కార్యక్రమా లకు ఆయన గత 20 ఏళ్లనుంచి ఉచితంగా వేలాది రూపాయల విలువైన కూరగాయలను పంపించేవాడు. రోటరీ సభ్యునిగా పలు సేవాకార్యక్రమాలలో పాల్గొన్నాడు. మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. గురువారం ఉదయం ఆయన స్వగృహంలో బుడే మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.